సాక్షి ఒడిశా

సోమవారం ; 11 ; ఆగస్టు ; 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 8,28,790

బంగారం : 7 గ్రాముల 250 మిల్లీ గ్రాములు

వెండి : 55 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

రాష్ట్రంలో మోహన్ భగవత్ పర్యటన

భువనేశ్వర్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రముఖుడు డాక్టర్ మోహన్ భగవత్ రాష్ట్ర పర్యటనకు రానున్నారు. మూడు రోజులపాటు రాష్ట్రంలో పర్యటిస్తారు. ఈ నెల 13న తేదీన మోహన్ భగవత్ భువనేశ్వర్ చేరుతారు. 15వ తేదీ వరకు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. గౌడియా మిషన్ ఆహ్వానం మేరకు భగవత్ ఒడిశాకు వస్తున్నారు. ఉత్కళ్ బిపన్న శ్వేత సమితిలో బస చేస్తారు. 14న గౌడియా వైష్ణవ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు. సాయంత్రం పూజ్య శంకరాచార్యుల దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందుతారు.

న్యూస్‌రీల్

చంద్రభాగ సముద్రంలో మునిగి ముగ్గురు మృతి

భువనేశ్వర్: కోణార్కు చంద్రభాగ సముద్ర తీరంలో రెండు వేర్వేరు చోట్ల ముగ్గురు యువకులు మృతి చెందారు. వీరంతా స్నేహితులతో కలిసి సముద్రంలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు మునిగి ప్రాణాలు కోల్పోయారు. చంద్రభాగ ఎకో–రిట్రీట్ సమీపంలో ఇద్దరు యువకులు మునిగిపోయారు. కొద్ది దూరంలో మరొక యువకుడు మునిగి ప్రాణాలు కోల్పోయాడు. ఇద్దరిని భువనేశ్వర్ వాసులుగా మరొకరిని కటక్ సమీపం పాహలా ప్రాంతీయుడిగా గుర్తించారు.

కరెంట్ షాక్‌తో పురోహితుడు మృతి

భువనేశ్వర్: హరిపూర్ గ్రామంలో కరెంట్ షాక్‌తో పురోహితుడు మృతి చెందారు. తిర్తోల్ పోలీస్ ఠాణా పరిధిలోని కనక్‌పూర్ పంచాయతీ హరిపూర్ గ్రామంలోని చెరువు నీటిలో విద్యుత్ ప్రవహించడంతో ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో సరళా ఆలయ పురోహితుడు కమల్ రౌలు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. నీరు తాగడానికి వచ్చిన ఆవు కూడా విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయింది.

గ్యాస్ సిలిండర్ పేలుడులో.. ముగ్గురికి గాయాలు



ఘటనా స్థలంలో ధ్వంసమైన వస్తువులు

భువనేశ్వర్: వంట గ్యాస్ సిలిండర్ పేలి ఇంటిల్లపాది ప్రాణాపాయంలో చిక్కుకున్నారు. ఈ దుర్ఘటనలో ముగ్గురు కుటుంబీకులు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా స్థానిక అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. వీరందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్య వర్గాల సమాచారం. ఈ సంఘటన అంగుల్ ప్రాంతంలో ఆదివారం జరిగింది. భారీ పేలుడు శబ్దంతో ఇరుగు, పొరుగు వారు ఉలికిపడ్డారు. స్థానికులు వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. ఘటనా స్థలం చేరే సరికి అంతా ధ్వంసమైందని స్థానికులు తెలిపారు. ఈ సంఘటన ఎలా జరిగిందన్న విషయం అస్పష్టంగా ఉంది. క్షతగాత్రులను తొలుత చేరువలో ఉన్న నాల్కో ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో సత్వరం ఉన్నత చికిత్స కోసం ఎయిమ్స్‌కు తరలించారు.

పట్టముండై యువతి మరణం కేసులో ప్రియుడు అరెస్టు

భువనేశ్వర్: కేంద్రాపడా జిల్లా కొథియాపాడా గ్రామంలో 20 ఏళ్ల యువతి అనుమానాస్పద మరణం కేసులో ఆమె ప్రియుడిని ప్రధాన నిందితుడిగా ధ్రువీకరించి అరెస్టు చేశారు. నిందితుడిని 25 ఏళ్ల ప్రమోద్ బెహరాగా పేర్కొన్నారు. కేంద్రాపడా పోలీసులు అతడ్ని అరెస్టు చేశారు.

బలమైన ఆధారాలతో నిందితుడి అరెస్టు

ప్రాథమిక సమాచారం ఆధారంగా రుజువైన సాక్ష్యాల బలంతో నిందితుడ్ని అరెస్టు చేసినట్లు కేంద్రాపడా జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సిద్ధార్థ కటారియా తెలిపారు. పట్టముండై గ్రామీణ పోలీసులు నిందితుని అరెస్టు చేశారు. నిందితుడు ప్రమోద్ బెహరా మొబైల్‌లో 60 అశ్లీల వీడియోలు ఉన్నట్లు ఆధారాలు లభించాయి. జూలై 17న యువతి తండ్రికి అశ్లీల వీడియో పంపాడు. అదే రోజు మరో 4 నుంచి 5 మందికి కూడా వీటిని పంపాడు. సంఘటన జరిగిన రోజు ఉదయం 7.34 గంటలకు అతను ఆమె మొబైల్‌కు ఫోన్ చేశాడు. ఈ నేపథ్యంలో పోలీసులు నిందితుడు, బాధితురాలి తండ్రి మొబైల్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు సాగిన దర్యాప్తు ఆధారంగా నిందితుడు ప్రమోద్ బెహరాని మాత్రమే అరెస్టు చేశారు. తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు

రాయగడ: శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడ్డాడు. గాయాలు తగిలిన వ్యక్తి జిల్లాలోని కల్యాణసింగుపూర్ సమితి బుడాగుడ పంచాయతీలోని కుమారిగుడ గ్రామానికి చెందిన నిరంజన్ గరడియాగా(32) పోలీసులు గుర్తించారు. శనివారం రాత్రి 8 గంటల సమయంలో ఇంటి నుంచి పని మీద బయటకు వచ్చిన అతడు మెయిన్ రోడ్డు వద్ద గల రోడ్డుకు అవతల నిలబడి ఫోన్‌లో మాట్లాడుతున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన ఒక గుర్తు తెలియని బైక్ అతడిని ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో అతడు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని అంబులెన్స్‌లో కల్యాణసింగుపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి బైకు నడిపే వ్యక్తి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు సమాచారం.

ఘనంగా పాణిగ్రాహి జయంతి వేడుకలు



పాణిగ్రాహి జయంతి ఉత్సవానికి విచ్చేసిన అదనపు కలెక్టర్, పురపాలక సంఘ చైర్మన్



పండిత రఘునాథ పాణిగ్రాహి చిత్రపటం

పర్లాకిమిడి: పద్మశ్రీ పండిత రఘునాథ పాణిగ్రాహి 94వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం స్థానిక టౌన్‌హాల్‌లో నృత్యసంగీత విభావరి ఒడిశా సాహిత్య, సంగీత అకాడమి, మరియు భక్తినైవేద్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా ఆదనపు కలెక్టర్ మునీంద్ర హానగ విచ్చేసి ప్రారంభించగా, ఇతర అతిథులుగా పర్లాకిమిడి పురపాలక సంఘం చైర్మన్ నిర్మలా శెఠి, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్, నృసింహా చరణ్ పట్నాయక్, ఆదర్శదాస్ తదితరులు విచ్చేశారు. పండిత రఘునాథ పాణిగ్రాహి ఒడిషా సంగీతంతో పాటు తెలుగు, బెంగాలీ గీతాలు పాడి ఒడిషారాష్ట్రానికి పేరు తెచ్చారని నృసింహా చరణ్ పట్నాయిక్ అన్నారు. తొలుత భుభనేశ్వర్ నుండి విచ్చేసిన సంగీత గాయకులు జగన్నాథ స్వామి భక్తి గీతం కడు శ్రావ్యంగా వినిపించారు. ఫ్లూట్‌లో వెల్లంకి కూర్మనాథం వాయించగా, తబలా, హార్మోనియం పై స్థానిక కళాకారులు సహకరించారు. చివర్న కళాకారులకు మెమెంటోతో అతిథులను సత్కరించారు.



భక్తి పాటలు పాడుతున్న భువనేశ్వర్ కళాకారులు



పండిత రఘునాథ పాణిగ్రాహి జయంతి ఉత్సవానికి విచ్చేసిన అభిమానులు

జగన్నాథుని ప్రసాదంపై అసత్య ప్రచారం



ఆన్‌లైన్‌లో మహా ప్రసాదం బుకింగ్



ఆన్‌లైన్‌లో లభ్యమయ్యే శ్రీ జగన్నాథుని మహా ప్రసాదం వివరాలు

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథ స్వామి అన్న ప్రసాదాలు ఆన్‌లైన్‌లో లభ్యం అవుతున్నట్లు తరచూ బూటకపు ప్రసారాలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఇలాంటి తాజా సంఘటన ఆదివారం వెలుగు చూసింది. ఈజీ ఎసెన్షియల్స్ అనే యాప్ ద్వారా స్వామి అన్న ప్రసాదాలు (ఒఖొడా) హోం డెలివరీ చేస్తామని ప్రసారం అవుతుంది. దీనికి సంబంధించిన సమాచారంతో సోషల్ మీడియాలో ప్రసారం విస్తృతంగా కొనసాగుతుంది. ఈ యాప్ ఆధ్వర్యంలో ఒఖొడా, డల్మా, సగ్గొ, బెసారొ వంటి అన్న ప్రసాద పదార్థాలు వినియోగదారులకు ఇంటి ముంగిట అందజేయడం జరుగుతుందని ఈ యాప్ ప్రసారం సమగ్ర సారాంశం. ఆర్డర్లు ఒకసారి ఖరారు అయితే రద్దు చేయబడవు. రాత్రి 10.30 గంటల లోపు ఇంటి ముంగిట అందజేయబడతాయనే హామీతో ప్రసారం చేసి భక్తుల్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. ఈ సేవలు సోమ, గురు, శని వారాల్లో మాత్రమే అందుబాటులో ఉంటాయని యాప్ సోషల్ మీడియా ప్రసారంలో పేర్కొంది. ఆలయ ఆచార వ్యవహారాలు లేదా రవాణా సంబంధిత సమస్యల కారణంగా ప్రసాదాలు అందజేయడంలో ఏదైనా ఆలస్యం జరిగితే ముందస్తుగా తెలియజేయడం జరుగుతుందని సోషల్ మీడియా సాక్షిగా అభయం కూడా ఇచ్చారు. ఈ ప్రసారంపై సేవాయత్ వర్గం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. దర్యాప్తు జరిపించి బాధ్యులైన వారి వ్యతిరేకంగా కఠిన చర్యలు చేపట్టే దిశలో చట్టాలు తీసుకురావాలని ఈ వర్గం డిమాండ్ చేసింది.

• మహామృత్యుంజయ హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త చైతన్య రాంజీ ఆధ్వర్యంలో సదరు సమితి పరిధిలోని పితామహల్ పంచాయతీ శ్రీరామనగర్ గ్రామంలో ఆదివారం మహా మృత్యుంజయ హోమం జరిగింది. ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధికంగా హాజరయ్యారు. అంతా సుఖఃసంతోషాలతో ఉండాలని కొరుతూ ప్రతీ ఏడాది శ్రావణ మాసంలో ఇటువంటి తరహా పూజా కార్యక్రమాలను నిర్వహిస్తు గ్రామస్తులకు ఆధ్యాత్మికతపై ఆసక్తి కలిగేలా కృషి చేస్తున్నామని రాంజీ చెప్పారు. హోమంతో పాటు సుందర కాండ, హనుమాన్ సాలిస పఠనం వంటి కార్యక్రమాలను నిర్వహించామన్నారు.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ



ఆహార పొట్లాలను పంపిణీ చేస్తున్న రజిత తదితరులు

రాయగడ: స్థానిక లయన్స్ క్లబ్ అపరాజిత సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నిరుపేదలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. స్థానిక రైల్వే స్టేషన్, కొత్త బస్టాండు, డైలీ మార్కెట్, న్యూకాలనీ తదితర ప్రాంతాల్లో సంస్థ సభ్యులు తిరిగి అక్కడ ఉండే నిరుపేదలకు ఆహారాన్ని అందజేశారు. సంస్థ అధ్యక్షులు జి.రామక్రిష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యదర్శి బరాటం అవంతి, కొశాధికారి పి.కళ్యాణి, కొరాడ రజిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవంతి మాట్లాడుతూ.. 65 మంది నిరుపేదలకు ఆహార పొట్లాలను పంపిణీ చేసినట్టు వెల్లడించారు. ఇటువంటి తరహా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించేందుకు కార్యచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

దరి చేరని ప్రగతి 'వెలుగులు'



విద్యుత్ సౌకర్యం లేక కిరసనాయిల్ దీపపు వెలుతురులో చదువుతున్న విద్యార్థులు

జయపురం: అంగటిలో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్లు ఉంది కొరాపుట్ జిల్లాలో పలు గ్రామాల ప్రజల పరిస్థితి. అటు ఆంధ్ర రాష్ట్రానికి విద్యుత్ సమకూర్చుతూ, ఒడిశా రాష్ట్రంలో మొదట విద్యుత్ వెలుగు ప్రసాదించిన మాచ్‌ఖండ్ జలవిద్యుత్ ప్రాజెక్టు, అప్పర్ కొలాబ్ జలవిద్యుత్ ప్రాజెక్టులతో పాటు అవిభక్త కొరాపుట్‌లో బలిమెల జల విద్యుత్ ప్రాజెక్టు, అప్పర్ ఇంద్రావతీ జలవిద్యుత్‌లు ఉన్నా అవిభక్త కొరాపుట్‌లో వందలాది గ్రామాల ప్రజలు నేటికీ కిరసనాయిల్ బుడ్డీల వెలుగులోనే బతుకుతున్నారు. ఈ దీన పరిస్థితుల్లోనూ విద్యార్థులూ చదువులు కొనసాగిస్తున్నారు. జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితిలో 34 గ్రామాలకు నేటికీ విద్యుత్ సౌకర్యం లేదు. విజయవాడ–రాంఛీ జాతీయ కారిడార్ మార్గంలో గల బొయిపరిగుడ సమితి కొలార్ గ్రామం పంచాయతీ దుదామగుడ గ్రామంలో నేడు పత్రికల వారు సందర్శించగా ఆ గ్రామంలో విద్యుత్ సౌకర్యం కనిపించలేదు. రాత్రిళ్లు గ్రామం మధ్యన కట్టెల మంట వేసి ఉంటున్నారు. పిల్లలు చిన్న దీపం వెలిగించి ఆ వెలుగులోనే చదువుకుంటున్నారు. బొయిపరిగుడ సమితి తెంతులిగుమ్మ, బొదాపుట్, గుప్తేశ్వర, మఖిగుడ, కాటజొడి, టిపాకూర్ తదితర పంచాయతీల్లో 34 గ్రామాల పరిస్థితి ఇలాగే ఉంది. కొన్ని చోట్ల సోలార్ దీపాలు పెట్టినా అవి పాడైపోయాయి.

నేటి నుంచి రెవెన్యూ ఉద్యోగుల ఆందోళన బాట



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రెవెన్యూ అమలా సంఘం ఉద్యోగులు

పర్లాకిమిడి: ఈ నెల 11 నుంచి ఒడిషా రెవెన్యూ అమలా సంఘం ఉద్యోగులు సామూహిక సెలవులు పెట్టనున్నారు. ఆదివారం కలెక్టర్ మధుమితను మినిస్టిరియల్ ఉద్యోగులు అంతా కలిసి విన్నవించారు. రెండేళ్లగా రెవెన్యూ ఉద్యోగుల తొమ్మిది డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చని కారణంగా సెలవు పెట్టి ఆందోళనలో దిగుతున్నారు. దీనిపై జిల్లా కలెక్టరేట్, జిల్లాలోని హెడ్స్ ఆఫ్‌డిపార్ట్‌మెంట్స్, ఏడు సమితి కేంద్రాల్లో పనులు ఎలా జరుగుతాయన్నది చర్చనీయాంశమైంది. ఈ సామూహిక సెలువులు, ఆందోళనలు రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్నట్టు జిల్లా రెవెన్యూ అమలా సంఘం కార్యదర్శి సంతును తెలిపారు.

మునిగుడలో ఘోర రోడ్డు ప్రమాదం

• ఇద్దరు మృతి– ఇద్దరికి గాయాలు



చెట్టుకు ఢీకొన్న వ్యాన్



ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి



ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి



గాయాలతో చికిత్స పొందుతున్న బాలుడు

రాయగడ: పికప్ వ్యాన్ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న రెండు బైకులను ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా మరొకరు గాయాలపాలయ్యారు. జిల్లాలోని మునిగుడ సమితి దేవకుపిలి కూడలిలో ఆదివారం రాత్రి 8.30 గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంది. సంఘటన సమాచారం తెలుసుకున్న మునిగుడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం కోసం మునిగుడ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. అంబొదల నుంచి వస్తున్న ఒక పికప్ వ్యాన్ మునిగుడ సమితి దేవకుపిలి చేరే సరికి అదుపుతప్పి ఎదురుగా వస్తున్న రెండు బైకులను బలంగా ఢీకొంది. దీంతో బైక్ నడుపుతున్న ఇద్దరు సంఘటన స్థలం వద్దే మృతి చెందగా ఒక బైకుపై వెనుక కూర్చున్న బాలుడు గాయాలపాలయ్యాడు. బైకులను ఢీకొన్న వ్యాన్ పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. దీంతో వ్యాన్ డ్రైవరు కూడా గాయాలతో మునిగుడ ఆస్పత్రిలో చేరాడు. అయితే క్షతగాత్రులు, మృతుల వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నారు .

పొలంబడిలో విద్యార్థులు



వరి నారుతో పొలంలో విద్యార్థులు



విద్యార్థులతో పాటు వరి ఉడుస్తున్న గ్రామ మహిళలు

జయపురం సమితి సౌరగుడ గ్రామంలో విద్యార్థులు పొలంలో దిగారు. సౌరగుడ గ్రామంలో దాస సాంత అనే రైతు పొలంలో 18 మంది విద్యార్థులు నాట్లు వేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ విభాగ విశ్రాంత జిల్లా అధికారి జి.వెంకట రెడ్డి పాల్గొని నాట్లు వేయడం నేర్పించారు. రైతులు ఎంతగా కష్టపడతారో వివరించారు. – జయపురం



సామూహికంగా వరి నారు ఉడుస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముఖ్య అతిథి వెంకట రెడ్డి



పొలంలో పడిపోకుండా నడిచే విధానాన్ని తెలుపుతున్న ఉపాధ్యాయుడు ప్రతాప్ పట్నాయిక్

క్లుప్తంగా

మహిళల పాలిట శాపంగా కూటమి పాలన

- వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఉలాల దివ్యభారతి



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)/ఇచ్ఛాపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని చంద్రబాబు ప్రభుత్వం మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేసి గుడి, బడి, నివాస గృహాలు అనే తేడా లేకుండా ఇష్టం వచ్చినట్లు మద్యం అమ్మకాలు సాగిస్తూ లక్షలాది కుటుంబాల్ని రోడ్డున పడేస్తున్నారని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఉలాల దివ్యభారతి ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విచ్చలవిడిగా మద్యం తాగేవారు ఎక్కువ కావడంతో మహిళలు రోడ్డుపై నడవలేని పరిస్థితి నెలకొందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 33 శాతం మద్యం షాపులు తగ్గించడంతో పాటు అనుబంధంగా ఉన్న పర్మిట్ రూమ్‌లు సైతం తగ్గించేశారని గుర్తు చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో ఆంక్షలు విధించడం సరికాదన్నారు. అన్ని బస్సుల్లోనూ ప్రయాణానికి ఆంక్షలు కల్పించాలని కోరారు. ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించడం సీఎం చంద్రబాబు వెన్నతో పెట్టిన విద్య అని పేర్కొన్నారు.

తీరంలో మృతదేహం కలకలం

సరుబుజ్జిలి : వంశధార నదీ తీరప్రాంతంలోని తెలికిపెంట బ్రిడ్జి వద్ద ఆదివారం గుర్తు తెలియని మృతదేహం కలకలం రేపింది. ఎక్కడో హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడికి తెచ్చి పాతిపెట్టినట్లు పుకార్లు వ్యాపించాయి. ఈ సమయంలో సమయంలో పోలీసులు రావడం చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళ్తే.. జలుమూరు మండలం కొండకామేశ్వర పేటకు చెందిన ఓ బిచ్చగాడు అనారోగ్యంతో మృతిచెందాడు. వంశధార ఆవలి ప్రాంతం సక్రమంగా లేకపోవడంతో తెలికిపెంట బ్రిడ్జి సమీపంలో దహనక్రియలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈలోగా తెలికిపెంట గ్రామస్తులకు సమాచారం వెళ్లడంతో అక్కడ శవాన్ని ఇక్కడ తెచ్చి ఎలా దహనం చేస్తారని అభ్యంతరం తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఇరుపక్షాలతో మాట్లాడారు. ఎవరికీ ఇబ్బందిలేని స్థలంలో దహన క్రియలు చేయించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

బలగలో చోరీ



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న సీఐ ఈశ్వరరావు

శ్రీకాకుళం క్రైం: జిల్లా కేంద్రంలో బలగలోని బండారువీధిలో ఓ వివాహిత ఇంట్లో చోరీ జరిగింది. శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. బండారు వీధిలో సీపాన కోమలి తన కుమారునితో కలిసి ఉంటోంది. ఈ నెల 8న సాయంత్రం సత్యవరం నర్సంపేటలో ఉన్న తన అమ్మమ్మ ఇంటికి కుమారునితో కలిసి వెళ్లింది. ఆదివారం ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయని పొరుగింటి వారు చెప్పడంతో కోమలి వెంటనే ఇంటికి వచ్చి చూసింది. బీరువా తలుపులు పగులగొట్టి ఉండటంతో పాటు అందులో 6 తులాల బంగారం, రూ.50వేలు నగదు లేకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఈశ్వరరావు పర్యవేక్షణలో క్లూస్ టీంతో వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాలియాత్రకు పూర్వ వైభవం



మాట్లాడుతున్న జీవితేశ్వరరావు

జలుమూరు: కార్తీక పౌర్ణమి అనంతరం జరగనున్న బాలియాత్రకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామని కమిటీ ప్రతినిధి డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు తెలిపారు. ఆదివారం శ్రీముఖలింగంలో బాలియాత్ర నిర్వహణపై కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం పాటు జరిగే ఈ వేడుకలకు త్వరలోనే తేదీలు ఖరారు చేస్తామన్నారు. శ్రీముఖలింగంలో అన్ని కులాలను కలుపుకొని యాత్ర నిర్వహణపై చర్చించనున్నామన్నారు. సమావేశంలో సర్పంచ్ టి.సతీష్ కుమార్, ఎంపీటీసీ కె.హరిప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ టి.బలరాం, వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామపెద్దలు బి.వి.రమణ, తేజేశ్వరరావు, వేణు, చింతాడ వెంకటరావు, హెచ్‌వీ దొర, శేషాద్రి వేంకటాచలం, ఉపాధ్యాయులు, అర్చకులు పాల్గొన్నారు.

రవాణా శాఖలో.. సిబ్బంది కొరత

- కీలక ఏవో, ఆర్టీవో పోస్టులు ఖాళీ
- డీటీసీపైనే పనిభారం
- క్షేత్రస్థాయి తనిఖీలపై ప్రభావం



జిల్లా ఉప రవాణా శాఖ కార్యాలయం

శ్రీకాకుళం రూరల్:

జిల్లా ఉప రవాణా శాఖాధికారి కార్యాలయంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఏఓ, ఆర్టీఓ వంటి కీలకమైన పోస్టులు కొన్ని నెలలుగా భర్తీ కాక పోవడంతో ఆ ప్రభావం ప్రస్తుత సిబ్బందిపై పడుతోంది. డీటీసీ విజయసారథి కార్యాలయానికి వచ్చిన ఫైల్స్‌ను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నా సిబ్బంది కొరత కారణంగా క్షేత్రస్థాయిలో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం ఇన్‌చార్జులుగా ఏఓ స్థానంలో ఓ గుమస్తా, ఆర్టీవో స్థానంలో ఓ ఇన్‌స్పెక్టర్‌ను ఏర్పాటు చేసుకొని వచ్చిన ఫైల్స్‌ను అప్‌డేట్ చేయిస్తున్నారు. ఈ ఏడాది 2025–26కు సంబంధించిన ప్రభుత్వ టార్గెట్ రూ.142.75 కోట్లు ఇవ్వగా ఉన్న సిబ్బందితోనే గడిచిన నాలుగు నెలల్లో రూ.37.16 కోట్లకు చేరుకున్నారు. గత ఏడాది రూ.163 కోట్లు టార్గెట్ కాగా రూ.36.89 కోట్లతో సరిపెట్టుకున్నారు.

తనిఖీలు అంతంత మాత్రమే..

ప్రధానంగా ఆర్టీవో కార్యాలయంలో వాహనాలు తనిఖీలకు సంబంధించిన ప్రక్రియ మొక్కుబడిగానే కొనసాగుతోంది. జిల్లావ్యాప్తంగా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు 17 మంది ఉండాలి. ప్రస్తుతం ఒక్క అధికారి మాత్రమే ఉన్నారు. ఇన్‌స్పెక్టర్లు 10 మందికి గాను నలుగురు మాత్రమే పని చేస్తున్నారు. మిగిలిన ఆరుగురు డిప్యూటేషన్‌పై ఇతర జిల్లాల్లో విధులు నెరవేరుస్తున్నారు. ఇక రోడ్డు సేఫ్టీలు, డ్రైవర్లకు అవగాహన సదస్సులు, వాహనాల తనిఖీలు ఆయా ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణలోనే కొనసాగాలి. సిబ్బంది కొరత కారణంగా వీటి ఊసే లేదు.

కార్యాలయంలోనూ అంతే..

ఆర్టీఓ జిల్లా ప్రధాన కార్యాలయంలోనూ సిబ్బంది కొరత వెంటాడుతోంది. మొత్తం 68 మంది సిబ్బంది వివిధ సెక్షన్‌లలో పనిచేయాల్సి ఉండగా ప్రస్తుతం 27 మంది మాత్రమే ఉన్నారు. కొంతమంది డిప్యూటేషన్‌పై బయట విధులు నిర్వహిస్తున్నారు. ట్రాన్స్‌పోర్టు వాహనాలతో పాటు నాన్ ట్రాన్స్‌పోర్టులు, రిజిస్ట్రేషన్లు, వాహనాల బదిలీలు, ఫైనాన్స్ క్లియరెన్సులు, ఈకేవైసీలు వంటి పనులన్నీ ఎప్పటికప్పుడు క్లియర్ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆ పనులన్నీ డీటీసీ పర్యవేక్షణలో చేయిస్తున్నారు.

లేఖ రాశాం..



సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ప్రధానమైన ఏవో, ఆర్టీవో పోస్టులు కొన్ని నెలలుగా ఖాళీగా ఉన్నాయి. ఉన్న సిబ్బందితో పనులు చేయించుకుంటున్నాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఎప్పటి ఫైల్స్ అప్పుడే క్లియర్ చేస్తున్నాం.

– ఎ.విజయసారథి, జిల్లా ఉప రవాణా శాఖాధికారి

అక్టోబర్‌లో సీఐటీయూ జిల్లా మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సోంపేటలో అక్టోబర్‌లో జరిగే సీఐటీయూ జిల్లా 12వ మహాసభలు విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ధరల పెరుగుదల, అవసరాలు దృష్టిలో పెట్టుకొని కార్మికుల కనీస వేతనం నెలకు రూ.26,000గా అమలు చేయాలని, కనీస పెన్షన్ రూ.10,000 ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులను, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు తదితర స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. శ్యాంపిస్టన్ ప్లాంట్–2, రెడ్డీస్ లేబొరేటరీస్ పరిశ్రమల్లో కార్మికుల చార్టర్ ఆఫ్ డిమాండ్లు పరిష్కరించి వేతన ఒప్పందాలు చేయాలని, అక్రమంగా నిలుపుదల చేసిన కార్మిక నాయకులను విధుల్లోకి తీసుకోవాలని, భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని కోరారు. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థలు, పరిశ్రమల ప్రైవేటీకరణ చర్యలను మానుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు అల్లు మహాలక్ష్మి, జి.అమరావతి, ఎం.ఆదినారాయణమూర్తి, అల్లు.సత్యన్నారాయణ, కె.సూరయ్య, ఎస్.వి.రమణ, ఎస్.గణపతి, ఎస్.లక్ష్మీనారాయణ, బండారు మురళి, ఆర్.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

కుడ్యచిత్రాలు వారసత్వ సంపద



మ్యూరల్స్ ఆఫ్ శ్రీకూర్మం టెంపుల్ పుస్తకావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్ తదితరులు

గార: శ్రీకూర్మనాథ దేవస్థానంలోని ప్రాచీన కుడ్య చిత్రాలు వారసత్వ సంపదని, వీటిని పరిరక్షించి భావితరాలకు అందించేలా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆదివారం దేవాలయంలో పునఃసృష్టి చేయబడిన కుడ్య చిత్రాలు ఫొటో ప్రదర్శన, మ్యూరల్స్ ఆఫ్ శ్రీకూర్మం టెంపుల్ పుస్తకావిష్కరణ జరిగింది. కుడ్య చిత్రాలను కాకినాడకు చెందిన చిత్రకారులు సుబ్రహ్మణ్యేశ్వరరావు నాలుగు సంవత్సరాలు పరిశోధన చేసి పుస్తక రూపంలోకి తీసుకురావడంతో వీటిని ప్రభుత్వ అనుమతితో ప్రదర్శన చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వీటిని ఆర్కియాలజీ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో పునరుజ్జీవానికి చర్యలు చేపడతామన్నారు. ఇండిగో విమాన సంస్థ సీఎస్ఆర్ కింద రూ. 50 లక్షల నిధులతో శ్వేతపుష్కరిణి అభివృద్ధి చేస్తోందన్నారు. ముందుగా రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్య బృందం సంప్రదాయ నృత్య ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో ఈవో కె.నరసింహనాయుడు, ప్రముఖ శిల్పి దివిలి అప్పారావు, కోరాడ వెంకటరావు, వి.సింహాగిరి, మైగాపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే టీడీపీ దాడులు

- ఎమ్మెల్సీ నర్తు రామారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కడప జిల్లా పులివెందులలో ఏ ఎన్నిక నిర్వహించినా గెలుపు వైఎస్సార్ సీపీదేనని, చంద్రబాబు తలకిందులుగా తపస్సు చేసిన గెలవలేడని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని యాదవ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జెడ్పీటీసీ ఉప ఎన్నికల నేపథ్యంలో టీడీపీ మూకలు రెచ్చిపోతూ ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, రామలింగారెడ్డిపై దాడి చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడిగా ప్రజలకు అండగా నిలబడిన వ్యక్తి రమేష్‌యాదవ్ అని పేర్కొన్నారు. కూటమి పాలకులు ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేక తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుని దాడులు చేసి భయపెట్టి ఉప ఎన్నికలో గెలవాలనుకోవడం తగదన్నారు. ప్రజా సంక్షేమ పాలన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమన్నారు. చంద్రబాబు, లోకేష్‌లకు ఓటమి భయం పట్టుకుందన్నారు. బూత్ నెంబర్లు, పోలింగ్‌స్టేషన్లు మార్చేసి వారికి అనుకూలంగా చేసినంత మాత్రాన ప్రజలు ఓట్లు వేస్తారనుకోవడం భ్రమ అని పేర్కొన్నారు. ఇప్పటికైనా కూటమి నేతలు తీరు మార్చుకోక పోతే భవిష్యత్తులో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం రాజ్యమేలుతోందన్నారు. సమావేశంలో యాదవ సంఘ నాయకులు గద్దిబోయిన కృష్ణయాదవ్, రాపాక చిన్నారావు, చిన్ని జోగారావు, నక్క దేవానంద, సీమల తారక్, సెలగల శ్యామ్, మురపాల రామారావు, ఇప్పిలి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగి మృతి

పలాస: చిన్న నీలావతి గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి సాధ్ర సంతోష్‌కుమార్ (32)శనివారం రాత్రి మృతి చెందారు. ఈయన నాశిక్‌లో ఆర్మీ జవాన్‌గా పని చేస్తున్నారు. మూడు రోజుల క్రితం గ్రామానికి వచ్చారు. ఇంతలో అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తండ్రి జానకిరావు కరోన సమయంలో మృతి చెందగా, తల్లి హేమలత స్వగ్రామంలో, భార్య జయశ్రీ ఏడాది పిల్లాడితో అండమాన్‌లో కన్నవారింట్లో ఉంటోంది.

కేజీబీవీ ప్రిన్సిపాల్ బదిలీ అన్యాయం

శ్రీకాకుళం: పొందూరు మండలం లోలుగు కేజీబీవీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఒంటరి దళిత మహిళ రేజేటి సౌమ్యను బదిలీ చేయడం అన్యాయమని కేఎన్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి తప్పు చేయకపోయినా నిరాధారమైన ఆరోపణలు చేస్తూ స్థానిక ఎమ్మెల్యే, కార్యకర్తలు వేధింపులకు గురిచేయడం బాధాకరమన్నారు. లేనిపోని ఆరోపణలతో ఫిర్యాదులు చేసి విచారణ పేరుతో మానసికంగా వేధించారని పేర్కొన్నారు. అక్రమంగా కంచిలి కేజీబీవీకి బదిలీ చేయడం నిబంధనలకు విరుద్ధమని, సమగ్ర శిక్ష ఏపీసీ చర్యలను కేఎన్‌పీఎస్ ముక్తకంఠంతో ఖండిస్తున్నట్లు చెప్పారు. లోలుగు కేజీబీవీ ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య అక్రమ బదిలీని డెమొక్రాటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు ఖండించారు. స్థానిక కార్యకర్తలు తల్లిదండ్రుల సమావేశంలో అన్యాయంగా ఇబ్బందులకు గురిచేయడం బాధాకరమైన విషయమన్నారు. ఎటువంటి తప్పు చేయకపోయినా క్రమశిక్షణ చర్యలు పేరిట ఒంటరి దళిత మహిళ అని చూడకుండా సుదూర ప్రాంతమైన కంచిలికి బదిలీ చేయడం తగదన్నారు.

ప్రశ్నపత్రాలను పాఠశాలకే చేర్చాలి

శ్రీకాకుళం: ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం జరగనున్న ఫార్మెటివ్ అసెస్‌మెంట్–1 పరీక్షల ప్రశ్నపత్రాలను స్కూల్ పాయింట్ వద్దకే చేర్చాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణమూర్తి, జి.రమణ ఒక ప్రకటనలో కోరారు. ప్రశ్నపత్రాలను పాఠశాల వద్దకు చేర్చాలని స్పష్టంగా నిబంధనల్లో దిగువ స్థాయి అధికారులు పట్టించుకోకపోవడం తగదన్నారు. గతంలోనూ ప్రశ్నపత్రాలను క్లస్టర్ స్కూల్ కాంప్లెక్సు పరిధిలో ఉంచి టీచర్లను తీసుకెళ్లమని చెప్పేవారని, ఈ క్రమంలో ఉపాధ్యాయులు ఆత్రుతగా వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారని, ముఖ్యంగా సింగిల్ టీచర్లకు మరింత కష్టంగా ఉందని పేర్కొన్నారు.

గంజాయి రవాణా గుట్టురట్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామారావు



వివరాలు వెల్లడిస్తున్న జీఆర్‌పీ ఎస్ఐ కోటేశ్వరరావు

పాతపట్నం: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఒడిశా రాష్ట్రం జాజ్పూర్ గ్రామానికి చెందిన రవీంద్ర ప్రధాన్‌తో పాటు పాతపట్నం మండలం కాగువాడ గ్రామానికి చెందిన నవీన్ బరోడా, లావాటి నీలకంటూలను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఆదివారం పాతపట్నం పోలీస్ స్టేషన్‌లో సీఐ వి.రామారావు విలేకరులకు వివరాలు వెల్లడించారు. పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఆలయ సమీపంలోని మామిడి తోట వద్ద రవీంద్ర ప్రధాన్ కాగువాడకు చెందిన నవీన్ బరోడా, లావాటి నీలకంటూలకు 3.250 కిలోల గంజాయిని అమ్ముతుండగా ఎస్ఐ బి.లావణ్య నేతృత్వంలో సిబ్బంది పట్టుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

పలాస: ఒడిశా రాష్ట్రం అంబుగాన్ గ్రామానికి చెందిన రాహుల్ బూరో అనే వ్యక్తిని 4 కిలోల గంజాయితో అరెస్టు చేసినట్టు పలాస జి.ఆర్.పి ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులకు వివరాలు వెల్లడించారు. పలాస రైల్వే స్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ హెచ్‌సీ సోమేశ్వరరావు తనిఖీలు చేస్తుండగా రాహుల్ అనుమానాస్పదంగా కనిపించాడు. అతని వద్ద సంచిని పరిశీలించగా రెండు బ్యాగుల్లో ఉన్న 4కిలోల గంజాయి గుర్తించారు. తనది ఒడిశా రాష్ట్రమని, తన సోదరుడు పిపిన్ బూరో గంజాయి పండిస్తుంటాడని చెప్పారు. హైదరాబాద్‌లో అమ్మేందుకు వెళ్తున్నామని చెప్పారు. ఈ ఘటనలో రాహుల్ సోదరుడు తప్పించుకున్నాడు. గంజాయిని సీజ్ చేసి రాహుల్‌ను కోర్టుకు తరలించి రిమాండ్‌కు పంపించామని ఎస్ఐ చెప్పారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు



గాయపడిన రామారావు

కొత్తూరు : మెట్టూరు కూడలి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మెట్టూరుకు చెందిన పప్పు రామారావు తీవ్రంగా గాయపడ్డాడు. మెట్టూరు బిట్–2 ఆర్ఆర్ కాలనీకి చెందిన ఎం.సూరిబాబు తన బైక్‌పై కొత్తూరు నుంచి మెట్టూరు వస్తుండగా రోడ్డు పక్కనే ఉన్న రామారావును ఢీకొట్టాడు. ఈ ఘటనలో రామారావుకు తీవ్ర గాయాలు కావడంతో స్థానిక సీహెచ్‌సీలో ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీస్‌లు చెప్పారు.

నేరప్రవృత్తి వీడాలి



కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలో నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీసు స్టేషన్ల పరిధిలో సీఐలు, ఎస్ఐలు ఆదివారం రౌడీషీటర్లు, నేర చరిత్ర గలవారికి, పాత నేరస్తులకు, చెడు నడవడిక కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నేరప్రవృత్తిని వీడాలని హితవుపలికారు.

తెలుగుభాషను గౌరవిద్దాం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయం సమావేశ మందిరంలో యువ రచయితల వేదిక కార్యవర్గం సమావేశం ఆదివారం జరిగింది. వేదిక అధ్యక్షులు తంగి ఎర్రమ్మ ఆధ్వర్యంలో జరిగిన సభలో పాలిశెట్టి మధుబాబు మాట్లాడుతూ మహిళల హత్యలు, ఆత్మహత్యలు అనే అంశంపై ప్రసంగించారు. ఎంఈఓ బలివాడ జనార్దనరావు మాట్లాడుతూ తెలుగు భాషను గౌరవించడం, కాపాడుకోవడం అందరి బాధ్యతని చెప్పారు. సమావేశంలో సభ్యులు జనార్దనరావు, మాలతి, ధనుంజయరావు, చిన్నారావు, సంతోష్, నరేష్‌కుమార్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరం.. అక్కుపల్లి తీరం

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా శివసాగర్ బీచ్
- కోట్లాది రూపాయల నిధులు నీటిపాలు



ధ్వంసమైన షెడ్‌లు

వజ్రపుకొత్తూరు రూరల్: జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన పర్యాటక కేంద్రాల్లో అక్కుపల్లి శివసాగర్ బీచ్ ఒకటి. నిత్యం పర్యాటకుల తాకిడితో సందడిగా ఉండే ఈ తీరం అభివృద్ధికి మాత్రం ఆమడ దూరంలో ఉంటోంది. శివసాగర్ తీరాన్ని పర్యాటకేంద్రంగా తీర్చిదిద్దేందుకు 2018లో కోటి రూపాయలు నిధులు మంజూరయ్యాయి. పనుల నిర్మాణంలో నాణ్యత లోపంతో రక్షణ గోడ కూలిపోయింది. అప్పట్లో సంభవించిన తిత్లీ తుఫాన్ ప్రభావంతో రెస్టారెంట్, విశ్రాంతి గదులు, మరుగుదొడ్ల కోసం ఏర్పాటు చేసిన షెడ్‌లు ధ్వంసం కావడంతో నిధులు నీటిపాలయ్యాయి. అప్పటి నుంచి అభివృద్ధి పనులు నిలిచిపోయాయి.

సువిశాల తీరం..

విశాలమైన సముద్ర తీరం, పచ్చని చెట్లు, నీటిపై తేలియాడేలా కనిపించే పెద్ద పెద్ద రాళ్లు.. ఇలా అనేక ప్రకృతి అందాలు శివసాగర తీరం సొంతం. ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలలోని పర్లాకిమిడి, పాతపట్నం, టెక్కలిపట్నం, గొప్పిలి, టెక్కలి, కాశీబుగ్గ, పలాస, సుదూర ప్రాంతాలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పర్యాటకులు నిత్యం తీరానికి చేరుకుని ఆనందంగా గడుపుతుంటారు. రథసప్తమి, మహాశివరాత్రి లాంటి ప్రత్యేక పర్వదినాల్లో పర్యాటకుల తాకిడితో తీరం జనసంద్రంగా మారుతుంది.

సమస్యలు ఇవే..

తీరంలో అనేక సమస్యలు తిష్ఠ వేశాయి. ప్రధానంగా మంచినీరు, మరుగుదొడ్లు, స్నానాల గదులు, దుస్తులు మార్చుకునేందుకు గదులు, విశ్రాంతి గదులు, వాహనాలు పార్కింగ్ వంటివి లేక సందర్శకులకు ఇబ్బందులు తప్పడం లేదు. బీచ్ రోడ్డులో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టకపోవడం, తీరం ప్లాస్టిక్, మందుబాటిళ్లు, ఇతర వ్యర్థాలతో అధ్వానంగా దర్శనమిస్తోంది.



అక్కుపల్లి శివసాగర్ బీచ్



మందుబాబు విసిరిపడేసిన సీసాలు

అసాంఘిక కార్యక్రమాలు..

తీరం వెంబడి పచ్చని కొబ్బరి, జీడి తోటలు ఉండటంతో అసాంఘిక కార్యక్రమాలకు సైతం అడ్డాగా మారింది. ఆకతాయిలు, మందుబాబులు తీరంలో వెకిలి చేష్టలు చేస్తున్నారు. ఎక్కడపడితే అక్కడ మద్యం సీసాలు పడేస్తుండటంతో పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. తోటలు పేకాట రాయుళ్లకు అడ్డాగా మారాయని స్థానికులు వాపోతున్నారు.

అభివృద్ధి చేయాలి..



విశాలమైన సముద్ర తీరాన్ని అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి. ప్రస్తుతం తీరంలో ఎక్కడపడితే అక్కడ చెత్త చెదారం పేరుకుపోయి అధ్వానంగా ఉంది.

– పి.దేవయ్య, వజ్రపుకొత్తూరు

వసతులు లేవు..



కుటుంబ సభ్యులతో సరదాగా తీరంలో గడుపుదామని వస్తే సరైన సదుపాయాలు లేవు. ప్రధానంగా మహిళలకు ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. పాలకులు స్పందించి వసతులు ఏర్పాటు చేయాలి.

– పి.మోహన్, సారవకోట

కూర్మ గ్రామంలో జన్మాష్టమి వేడుకలు

హిరమండలం: కిట్టాలపాడు పంచాయతీ వైదేహి కూర్మ గ్రామంలో ఈ నెల 16, 17 తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. భజనలు, నృత్య కీర్తనలు, ప్రవచనాలు, నాటక ప్రదర్శనం, హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఆశ్రమంలో ఉంటూ సేవలో పాల్గొనవచ్చని తెలిపారు.

మాజీ సైనికుల నూతన భవనం ప్రారంభం



మాజీ సైనికులను సత్కరిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల : ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటలో ఆదివారం మాజీ సైనికుల నూతన భవనం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా మాజీ సైనికుల సంక్షేమ శాఖ అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ప్రస్తుతం సైనిక విధుల్లో ఉన్న వారు, మాజీ సైనికులు 110 మంది సహకారంతో భవన నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. విశిష్ట అతిథిగా విశ్రాంత గ్రూప్ కెప్టెన్ పి.ఈశ్వరరావు, ముఖ్య అతిథిగా ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి పాల్గొన్న ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ సీపాన అప్పారావు, వైస్ ప్రెసిడెంట్ సువ్వారి రంగనాథం, కార్యదర్శి పైడి నారాయణమూర్తి, జాయింట్ సెక్రటరీ పైడి వెంకటనారాయణ, కోశాధికారి పైడి రంగనాథం, చైర్మన్ పైడి రామారావు, వైస్ చైర్మన్ సనపల ఫల్గుణరావు, వి.సూర్యనారాయణ, మురళీధరరావు, తర్ర కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏటీఎంలో చోరీకి యత్నం


ధ్వంసమైన ఏటీఎం

పాచిపెంట: మండల కేంద్రంలో ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా బయట గల ఏటీఎంలో గుర్తు తెలియని వ్యక్తి శనివారం అర్ధరాత్రి చోరీకి యత్నించినట్లు ఎస్సై వెంకటసురేష్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం..శనివారం అర్ధ రాత్రి గుర్తుతెలియని వ్యక్తి ఏటీఎంలో చోరీకి ప్రయత్నం చేసి ముందుగా వెలుపల ఉన్న సీసీకెమెరాలు పూర్తిగా ధ్వంసం చేస్తున్న సమయంలో బ్యాంకు ఉద్యోగుల సెల్‌ఫోన్లకు మెసేజీలు వెళ్లాయి. మండల కేంద్రంలో నివాసముంటున్న బ్యాంకు ఉద్యోగులు బ్రాంచ్ వద్దకు వచ్చేసరికి, వారి రాకను గుర్తించిన ఆ వ్యక్తి పారిపోయాడు. దీనిపై బ్రాంచి మేనేజర్ దేవిగణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ


డివైడర్‌ను ఢీకొని మొరాయించి నిలిచిపోయిన లారీ, శిథిలమైన డివైడర్

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ కూడలి వద్ద మలుపులో పాలకొండ నుంచి వస్తున్న లారీ డివైడర్‌ను ఢీకొట్టడంతో డివైడర్ ప్రారంభ భాగం శిథిలమైంది. అలాగే ఢీకొన్న లారీ మొరాయించి మలుపు వద్దే నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్రస్థాయిలో అవస్థలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో ట్రాఫిక్ పోలీసులు మరోదారి నుంచి వాహనాలను ట్రాఫిక్ అంతరాయం లేకుండా మళ్లించే ప్రయత్రం చేశారు. శనివారం అర్ధరాత్రి లారీ ఢీకొని ఉండవచ్చునని స్థానికులు చెబుతున్నారు.

14.850 కేజీల గంజాయి స్వాధీనం


గంజాయి, నిందితులతో తహసీల్దార్ తదితరులు

కొమరాడ: మండలంలో కూనేరు చెక్ పోస్టు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆదివారం 14.850 కేజీల గంజాయి పట్టబడిందని ఎస్సై కె.నీలకంఠం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు రాయగడ నుంచి పార్వతీపురం వైపు వస్తున్న ఆటోలో రెండు బ్యాగులతో ఇద్దరు ఆడ, మగ వ్యక్తులు పట్టబడ్డారన్నారు. వారిని అదుపుల్లోకి తీసుకుని విచారణ చేయగా మరో నిందితుడిని ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అయ్యిండిగా గుర్తించామన్నారు. పట్టుబడిన ఇద్దరిపై కేసు నమోదు చేశామని గంజాయ అక్రమంగా తరలిస్తున్న వారిని తహసీల్దార్ సత్యన్నారాయణ సమక్షంలో విచారణ చేసి కేసు నమోదు చేసి అరెస్టు చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఆటో, బైక్ ఢీ: నలుగురికి గాయాలు


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లక్ష్మణరావు

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది.ఆదివారం సాయంత్రం తన కుమార్తె కుసుమాంజలికి జ్వరంగా ఉందని చిట్టి సీతారాపురం గ్రామానికి చెందిన ఎ.లక్ష్మణరావు మోటార్‌సైకిల్‌పై బయలు దేరి పారాది గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. దీంతో ఆటో బోల్తా పడగా అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో లక్ష్మణరావు తలకు తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్సానంతరం అత్యవసర చికిత్స కోసం విజయనగరం తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాసరచన పోటీలు

శృంగవరపుకోట: పట్టణంలోని స్థానిక శాఖా గ్రంథాలయంలో 'ఓటరు అక్షరాస్యత వేదిక' నేతృత్వంలో యువతకు 'స్వాతంత్య్రోద్యమంలో జాతీయ నాయకుల పాత్ర' అన్న అంశంపై ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆగస్టు 15న బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

సచివాలయ వ్యవస్థపై నిర్లక్ష్యం

- అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా పట్టించుకోని వైనం
- వినియోగంలోకి తేవాలని ప్రజల విజ్ఞప్తి


మధ్యలో నిర్మాణం నిలిచిపోయిన జీగిరాం సచివాలయం


నిర్మాణం పూర్తయి ప్రారంభానికి నోచుకోని అన్నం రాజువలస సచివాలయం

సాలూరు రూరల్: ఎంతో ప్రతిష్టాత్మకంగా గత జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం అన్న నినాదానికి తగ్గట్లు సేవలు అందించిన సచివాలయ భవన నిర్మాణాలపై కూటమి ప్రభుత్వం సీతకన్ను వేసిందనే చెప్పవచ్చు. సాలూరు మండలంలోని 29 పంచాయతీల్లో 22 సచివాలయ భవనాలు మంజూరు చేసిన గత ప్రభుత్వం దాదాపు 15 సచివాలయాలు పూర్తిచేయడమే కాకుండా మరికొన్నింటికి శ్లాబులు వేసి ఉన్నాయి. కొన్ని పారంభానికి సిద్ధంగా ఉన్న భవనాలు కూడా రంగులు వేసి ప్రజలకు సేవలంచేందుకు సిద్ధం చేయాల్సిన కూటమి ప్రభుత్వం కనీసం ఏడాది పూర్తయినా వాటిని పట్టించుకోకపోవడంతో ఆయా పంచాయతీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాలు గ్రామాల్లో ఉంటే ప్రజలకు దగ్గరగా సేవలు అందుతాయని నమ్ముతున్నారు. ఇంటింటికీ సేవలందించే సచివాలయ వ్యవస్థను బలోపేతం చేయాలని మేధావులతో పాటు పలు పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

మాజీ ఎంపీపీకి పరామర్శ


కృష్ణంనాయుడిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు బొత్స సత్యనారాయణ, మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని గెడ్డపువలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ కొణిసి కృష్ణంనాయుడిని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనువాసరావులు ఆదివారం పరామర్శించారు. ఇటీవల వారం రోజుల క్రితం మాజీ ఎంపీపీ కృష్ణంనాయుడు గుండెపోటుకు గురై విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుని ఇంటికి చేరుకున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న నాయకులిద్దరూ గెడ్డపువలస గ్రామానికి వెళ్లి కృష్ణంనాయుడిని పరిమర్శించి ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, ఆరోగ్యం కుదుటపడేంత వరకు కూడా ఎలాంటి వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని, ఎలాంటి ఒత్తిడికి లోనవ్వద్దని సూచించారు. కార్యక్రమంలో గరివిడి వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల విశ్వేశ్వరరావు, బమ్మిడి కార్తీక్, కడుమల రాంబాబు, గుడివాడ తమ్మినాయుడు, యల్లంటి పోలీస్‌నాయుడు, వలిరెడ్డి లక్ష్మణ, చీపురుపల్లి మండల నాయకులు ఇప్పిలి అనంతం, మీసాల వరహాలనాయుడు తదితరులు ఉన్నారు.

2400 కేజీల పీడీఎస్ బియ్యం పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం బస్తాలు

గంట్యాడ: అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని, వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. జామి మండలం అన్నంరాజుపేట గ్రామానికి చెందిన కోరాడ చంద్రశేఖర్ 2400 కేజీలు (48 బస్తాలు) బియ్యం అక్రమంగా తామరాపల్లి జంక్షన్ మీదుగా తరలిస్తుండగా ఆదివారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా 48బస్తాల పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి. సాయికృష్ణ తెలిపారు.

ఆకతాయిల ఆగడాలకు కళ్లెం

- 3,573 మందిపై టౌన్ న్యూసెన్స్ యాక్ట్

విజయనగరం క్రైమ్: సహేతుకరమైన కారణం లేకుండా అర్ధరాత్రి వేళ బహిరంగంగా తిరిగిన ప్రతి ఒక్కరిపై కేసులు నమోదు చేస్తామని ఆదివారం మరోసారి ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరించారు. ఇందుకుగాను సీఐ స్థాయి అధికారి పర్యవేక్షణలో ప్రతిరోజూ ప్రత్యేక రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా శనివారం రాత్రి గస్తీ నిర్వహించి 3,573 మందిపై టౌన్ న్యూసెన్స్ చట్టం ద్వారా కేసులు నమోదు చేశామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు కొన్ని కఠిన నిర్ణయాలు తప్పవని, అందుకు అనుగుణంగా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విజయనగరంలో రైల్వేస్టేషన్, ఆర్టీసి కాంప్లెక్స్, మూడు లాంతర్లు, కోట జంక్షన్, బాలాజీ జంక్షన్, దాసన్నపేట రైతు బజార్, రింగు రోడ్డు, కొత్తపేట, ఐస్ ఫ్యాక్టరీ, జమ్ము, వీటీ అగ్రహారం, బొబ్బిలి, నెల్లిమర్ల, రాజాం మున్సిపాల్టీల్లో కొన్ని ముఖ్య ప్రాంతాల్లోను పోలీసులు ప్రతిరోజూ తనిఖీలు చేపడుతున్నారన్నారు. రాత్రి 11గంటల తరువాత వ్యాపారాలు, షాపులు, టిఫిన్ బండ్లు మూసివేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యాపారాలు సాగించినా, సహేతుకరమైన కారణాలు లేకుండా బహిరంగ ప్రదేశాల్లో సంచరించిన వారిపై టౌన్ న్యూసెన్స్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం వారిని స్టేషన్‌కు తరలించి, కన్నవారి ముందు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని ఎస్పీ చెప్పారు.

10 మంది జూదరుల అరెస్టు

- రూ 42,300 నగదు స్వాదీనం
- 6 ద్విచక్రవాహనాలు సీజ్


పట్టుబడిన జూదరులను చూపిస్తున్న పోలీసులు (వెనుక నిలబడి ఉన్న పోలీసులు)

లక్కవరపుకోట: మండలంలోని తామరాపల్లి గ్రామం శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న కాయిన్ ఆటపై ఎస్సై నవీన్‌పడాల్ తన సిబ్బందితో ఆదివారం సాయంత్రం దాడి చేశారు. కాయిన్ ఆట ఆడుతున్న 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ 42,300 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అలాగే జూదరులకు సంబంధించిన 6 ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించే శక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని పట్టుబడితే ఎంతటి వారైనా శిక్ష తప్పదని ఎస్సై హెచ్చరించారు.కార్యక్రమంలో హెచ్‌సీ పాపారావు, కానిస్టేబుల్స్ గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందాల రాయుళ్లు..

బొండపల్లి: మండలం లోని కొత్త పాలెం గ్రామం పరిధిలో ఆదివారం కోడిపందాలు ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. పందెంలో పాల్గొన్న ఏడుగురితో పాటు, 5పందెం కోళ్లు, రూ.7,140 నగదు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


రామచంద్ర (ఫైల్)

భోగాపురం: మండలంలోని ముక్కాం గ్రామానికి చెందిన గనగళ్ల రామచంద్ర(28) విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై సూర్యకుమారి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గతంలో రామచంద్ర చేపలవేటకు వెళ్తూ కుటుబంతో జీవనం సాగించేవాడు. ఆయనకు భార్య యల్మాజీతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మధ్య చేపలవేటకు వెళ్లకుండా ఆటో నడుపుకుంటున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసైన రామచంద్ర శనివారం మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వమని భార్యను అడిగాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఎంతకీ భార్య డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు హుటాహుటిన విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు భార్య యల్మాజి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సూర్యకుమారి తెలిపారు.

గాయపడిన యువకుడు..

లక్కవరపుకోట: మండలంలోని అరకు–విశాఖ జాతీయ రహదారిలో గత నెల 29వ తేదీన రంగరాయపురం జంక్షన్ జోడుబందల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు బొబ్బరి వెంకటేష్ (24) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఎస్.కోట నుంచి తన సొంత గ్రామం కొత్తవలస మండలం చిన్నమన్నిపాలెం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఒక వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే.కాగా ఈ ప్రమాదంలో వెంకటేష్ తీవ్రంగా గాయపడడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు హెచ్‌సీ పాపారావు చెప్పారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామన్నారు.

పాము కాటుతో మహిళ..


సత్యవతి మృతదేహం

విజయనగరం క్రైమ్: విజయనగరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి పాత దుప్పాడకు చెందిన సత్యవతి (44)అనే మహిళ పాము కాటు వేయడంతో మృతి చెందినట్లు ఎస్సై దేవి ఆదివారం చెప్పారు. భర్తతో కలిసి ఆమె చల్లపేటలో పొలం పనులు చేసి తిరిగి వస్తున్న సమయంలో పొలం గట్టుపై నుంచి నడుస్తుండగా ఎడమ పాదంపై పాము కాటేయడంతో హుటాహుటిన భర్త నరసింగరావు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తీసుకు వెళ్లగా వైద్యచికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై దేవి చెప్పారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు..

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన జగదీష్(23) అనే యువకుడు విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. చీపురుపల్లి–గరివిడి ప్రధాన రహదారిని ఆనుకుని ఎస్‌డీఎస్ కళాశాల ఎదురుగా ఉన్న వాటర్ సర్వీసింగ్ కారుషెడ్డులో వాహనాన్ని వాష్ చేసేందుకు మోటార్ ఆన్ చేసి వాష్‌గన్ పట్టుకోగా షాక్ తగిలి మృతి చెందాడు.

శ్రీనిధిలో మెరుగైన వైద్య సేవలు

- ఆస్పత్రిని ప్రారంభించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్


శ్రీనిధి మెడికేర్, క్రిటికల్ కేర్ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం ఫోర్ట్: ఆస్పత్రికి వచ్చే రోగులకు సేవాదృక్పథంతో వైద్య సేవలు అందించాలని ఎంఎస్ఎంఈ, ఎన్ఆర్ఐ వ్యవహారాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు విజయనగరం పట్టణంలోని ఐనాక్స్ థియేటర్ వెనుక నూతనంగా నిర్మించిన శ్రీనిధి మెడికేర్, క్రిటికల్ కేర్, మల్టిస్పెషాలిటీ హాస్పిటల్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధునాతన వైద్య పరిజ్ఞానాన్ని వినియోగించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. జిల్లా కేంద్రంలో అన్ని రకాల వైద్య సేవలతో కూడిన శ్రీనిధి మెడికేర్, క్రిటికల్ కేర్ ఆస్పత్రి అందుబాటులోకి రావడం శుభపరిణామమన్నారు. సూపర్ స్పెషాలిటీ సేవల కోసం గతంలో విశాఖపట్నం వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు జిల్లా కేంద్రంలో అందుతున్నాయన్నారు. ఆస్పత్రి ఎం.డి డాక్టర్ వి. నవీన్ కుమార్ మాట్లాడుతూ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, ఐసీయూ, జనరల్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, న్యూరోసర్జరీ, నెఫ్రాలజీ, యురాలజీ, పలమనాలజీ సేవలు అందిస్తామన్నారు. డయాలసిస్, ఎక్స్‌రే, ల్యాబొరేటరీ, సిటిస్కాన్, ఫిజియోథెరపీ, క్యాజువాలిటీ, ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్, మాడ్యులర్, లామినర్ ఆపరేషన్ థియేటర్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆస్పత్రిలో 24 గంటల పాటు వైద్య సేవలు అందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే అదితిగజపతిరాజు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎం. జయచంద్రనాయుడు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ సెలక్షన్‌కు స్పందన కరువు


జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో అసోషియేషన్ సభ్యులు

- తప్పని పరిస్థితిలో సెలక్షన్‌కు వచ్చిన వారి ఎంపిక

లక్కవరపుకోట: మండల కేంద్రంలో గల ఏపీ మోడల్ స్కూల్‌లో బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్టుకు సంబంధించి 10వ సబ్ జూనియర్స్, 11వ సీనియర్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపికలకు క్రీడాకారుల నుంచి స్పందన కరువైంది. ఈ ఎంపికలకు క్రీడాకారులు అనుకున్న మొత్తంలో రాకపోవడంతో వచ్చిన వారిని తప్పని పరిస్థితిలో జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. కాగా ఈ ఎంపిక పోటీలను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రారంభించి మాట్లాడుతూ క్రీడలతోనే ఉజ్వలభవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.శ్రీనివాస్‌రావు, కార్యదర్శి జి.లక్ష్మణరావులు మాట్లాడుతూ నేడు ఎంపిక చేసిన క్రీడాకారులు ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు ప్రకాశం జిల్లా చెవ్వూరులో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కాగా ఎంపికకు వచ్చిన అతి కొద్ది మంది క్రీడాకారులకు సైతం నిర్వాహకులు కనీసం భోజనం, మంచినీటిసౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో నానా అవస్థలు పడ్డారు. తూతూమంత్రంగా ఎంపికలను నిర్వహించి మమ అనిపించారు.కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు గాడి రవికుమార్, జి.సింహాచలం,ఎస్.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పట్టని ప్రభుత్వం

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, తలే రాజేష్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జి తలే రాజేష్

వంగర: రైతు సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి తలే రాజేష్ అన్నారు. పంటలు సాగుచేసేందుకు రైతులు నానా అవస్థలు పడుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆదివారం మండల పరిధి కె.కొత్తవలసలో వారు విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా తోటపల్లి కుడిప్రధాన కాలువ ద్వారా వంగర మండలంలోని అనేక గ్రామాలకు సాగునీరందలేదని, దమ్ములు చేసేందుకు సాగునీరు లేక రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. తోటపల్లి శివారు గ్రామాల రైతులు స్వచ్ఛందంగా కాలువల్లో పనులు చేసుకుని సాగునీటిని మళ్లించుకునే పరిస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు అందుబాటులో ఎరువులు లేవని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రతి గ్రామ సచివాలయంలో పుష్కలంగా కావలసినన్ని ఎరువులు అందుబాటులో ఉండేవని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని కూటమి ప్రభుత్వం తీరును ఎండగట్టారు. అన్నదాత సుఖీభవ పథకంలో అధిక సంఖ్యలో పేర్లు గల్లంతయ్యాయని, అర్హులైన రైతులకు పథకం వర్తింపజేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో, డాక్టర్ నరేంద్ర, ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, సర్పంచ్‌లు పోలిరెడ్డి రమేష్, గర్బాపు నారాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొక్కెల వెంకటప్పలనాయుడు, కనగల పారినాయుడు, యలకల వాసునాయుడు, పెంకి గౌరునాయుడు, పెంకి లక్ష్మనాయుడు, పెంకి జంగంనాయుడు, వంజరాపు గోవిందరావు, పెంకి గౌరీశ్వరరావు, బెవర రామకృష్ణ, పొదిలాపు నారాయణరావు, పారిశర్ల రామకృష్ణ ఉన్నారు.

రిమ్స్‌లో అరుదైన చికిత్స

- ఐదు విభాగాల వైద్యుల కృషితో నిలబడిన ప్రాణం


ఆపరేషన్‌కు ముందు


ఆపరేషన్ తరువాత


రోగి శరీరం నుంచి తొలగించిన నీలం రంగులోకి మారిన రక్తం

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ సర్వజన ఆస్పత్రి వైద్యులు అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్న రోగికి చికిత్స అందించి ప్రాణాలు నిలబెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపుగా ఏ ప్రభుత్వ ఆస్పత్రిలోనూ ఇలాంటి క్లిష్టమైన చికిత్స జరగలేదని తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే... జూలై 8వ తేదీన సీతంపేటకు చెందిన సిద్ధమంగుల బారికి అనే 58 ఏళ్ల గిరిజన వృద్ధుడు తీవ్రమైన ఆయాసం, తలనొప్పితో పాటు చర్మం, నాలుక నీలం రంగులోనికి మారి రిమ్స్‌లో చేరాడు. అప్పటికే అతనికి ఊపిరి తీసుకోవడం కష్టంగా మారింది. దీంతో రిమ్స్ వైద్యులు రోగికి వెంటిలేటర్‌ను అమర్చి ఆక్సిజన్ అందిస్తూ చికిత్స ప్రారంభించారు. రోగిని అప్పటికే చాలా ఆస్పత్రుల్లో చూపించగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పడంతో రిమ్స్‌కు తీసుకువచ్చారు. అతనికి అప్పటికి రక్తంలో ఆక్సిజన్ శాతం 53 మాత్రమే ఉంది. రిమ్స్‌లోని వైద్యులు ఐసీయూలో ఉంచి మందులు ఇస్తూ ప్రయత్నం చేశారు. ఓ దశలో రక్తంలో ఉన్న ఆక్సిజన్ శాతం 87కు చేరినప్పటికీ, అది ఎక్కువ రోజులు నిలబడలేదు. అప్పుడు రక్తాన్ని పరీక్ష నిమిత్తం విశాఖపట్నం పంపించారు. అక్కడ పరీక్షల్లో అతనికి ఉన్న వ్యాధి 'మెథెమోగ్లోబినిమియా'గా నిర్ధారణ అయింది. అయితే అప్పటికే అతని పరిస్థితి కష్టతరంగా మారడంతో రిమ్స్‌లోని ఐదు విభాగాల వైద్యులు పరస్పరం చర్చించుకున్నారు. రోగికి శరీరంలో ఉన్న రక్తమంతా తీసి వేస్తూ, మరో వంక కొత్త రక్తాన్ని ఎక్కించడం ద్వారా రోగి ప్రాణాన్ని రక్షించవచ్చునని భావించారు. అయితే ఈ సమయంలో రోగి ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఉండే అవకాశాలు ఉండడంతో, రోగి బంధువులతో మాట్లాడారు. పరిస్థితిని వారికి వివరించారు.

ఏ రకమైన చికిత్స చేయకపోయినా వారం పది రోజుల్లో మృతి చెందే అవకాశం ఉండడంతో, బంధువులు చికిత్స జరపాలని వైద్యులను కోరారు. దీంతో వైద్యులు రంగంలోకి దిగి ఓ పక్క రక్తం ఎక్కిస్తూనే మరో వంక శరీరంలో ఉన్న రక్తాన్ని తొలగిస్తూ వచ్చారు. సుమారు 17 యూనిట్ల రక్తం అంటే 4.2 లీటర్ల రక్తాన్ని ఎక్కించారు. అదే స్థాయిలో పాత రక్తాన్ని తొలగించారు. అటు తర్వాత రక్తంలో ఆక్సిజన్ శాతం పరీక్షించగా 97 శాతం చేరుకోవడం అది నిలకడగా ఉండడంతో, క్రమేపి వెంటిలేటర్‌ను అటు తర్వాత ఆక్సిజన్ తొలగించి పరీక్షించారు. అప్పుడు కూడా ఆక్సిజన్ శాతం తగ్గకపోవడంతో పూర్తిగా ఆక్సిజన్ తీసివేశారు. మళ్లీ పరీక్షించగా రక్తంలో ఆక్సిజన్ శాతం 97 ఉండడం పల్స్, బీపీ రేటు నిలకడగా ఉండటంతో జూలై 24న రోగిని డిశ్చార్జ్ చేశారు. జూలై చివరివారంలో రోగిని మరోసారి రప్పించి పరీక్షలు చేయగా అప్పుడు కూడా నిలకడగానే ఉండడంతో మళ్లీ ఇంటికి పంపించేశారు. ఈ నెల 5వ తేదీన మళ్లీ తనిఖీ చేయగా అతను ఆరోగ్యకరంగా ఉన్నట్లు గుర్తించారు. మళ్లీ 15 రోజుల తర్వాత తనిఖీలకు రావాలని చెప్పి పంపించేశారు. రోగి మృతి చెందుతాడని భావించగా రిమ్స్ వైద్యులు విశేష సేవలు అందించి ప్రాణం నిలబెట్టారని వారికి బంధువులు ఆనందం వ్యక్తం చేస్తూ వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. రోగికి వైద్య సేవలు అందించి ప్రాణం నిలబెట్టిన ఎమర్జెన్సీ విభాగం పేథాలజీ విభాగం, నెఫ్రాలజీ విభాగం జనరల్ మెడిసిన్ విభాగం, బ్లడ్ బ్యాంక్ విభాగం వైద్యులను పలువురు అభినందించారు.

ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

పార్వతీపురం రూరల్: పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆ పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.వరలక్ష్మి డిమాండ్ చేశారు. భోజన పథకం యూనియన్ జిల్లా రెండో మహాసభలు జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో ఆదివారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న వరలక్ష్మి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఈ పథకంలో దేశంలో 25 లక్షల మంది, రాష్ట్రంలో 85 వేల మంది సిబ్బంది నిర్వహణలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. వీరంతా నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళలే అన్న విషయం పాలకులు గుర్తించాలన్నారు. ఇందులో ఎక్కువగా వితంతువులు, ఒంటరి మహిళలు ఉన్నారని వెల్లడించారు. మహిళ సాధికారత కోసం జపించే పాలకులు 11 సంవత్సరాలుగా భోజన కార్మికుల వేతనాలు పెంచకపోవడం బాధాకరమన్నారు. యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బి.సుధారాణి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కేటాయింపులు అంతంతమాత్రంగానే ఉన్నాయని చెప్పారు. విద్యార్థికి కనీసం రూ.20 మెనూ చార్జీలు ఇవ్వాలని, జాతీయ విద్యా విధానం 2020ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మధరావు, జిల్లా ఉపాధ్యక్షులు వి.రామలక్ష్మి, జిల్లా కోశాధికారి వెంకటరమణ, అలాగే జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి వచ్చిన మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక

అనంతరం జిల్లా యూనియన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా జి.తులసి, ప్రధాన కార్యదర్శిగా వై.శాంతికుమారి, కోశాధికారిగా కె.మీనాకుమారి, జిల్లా కమిటీ సభ్యులుగా యు.లక్ష్మి, కె.ఉష, పావని, కళ్యాణి, సుశీల, గౌరమ్మ, రజని, సావిత్రమ్మ, షబానా ఎన్నికయ్యారు.